# విజ్ఞేశ్వరం చీకటి కోణం

## (కోనసీమలో 'గ్యాస్‌లీక్' పైన నివేదిక)

దేశ అభివృద్ధి పేరిట ప్రభుతం చేపట్టే పనులవల్ల ప్రజలలో కొందరు నష్టపోతే ఆ నష్టాన్ని దేశం తరఫున ప్రభుత్వం భరించనవసరం లేదా అనే ప్రశ్న రకరకాల రూపాలలో ముందుకొస్తుంటుంది. ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం దీనికొక ఉదాహరణ. అయితే ఇంకా అనేక ఉదాహరణలు తారసపడతాయి. 'దేశ అభివృద్ధి' నిజంగా దేశంలో అందరి అభివృద్ధి అయివున్నా ఈ నమస్య తలెత్తేదే. కానీ మన దేశం అనుసరిస్తున్న అభివృద్ధి పంథాలో దేశఅభివృద్ధి అనేది కొందరి అభివృద్ధి మాత్రమే. అటువంటప్పుడు సమస్య మరింత తీవ్రరూపం దాలుస్తుంది. చాలా తరచుగా అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రయోజనం పొందేది ఒకరు, నిర్వాసితులయ్యేది లేక ఇతరత్రా నష్టపోయేది వేరొకరు.

పశ్చిమ ఆసియా నుండి లభ్యమయ్యే చమురు చవకగా లభించే రోజులుపోయి రెండు దశాబ్దాలు దాటింది. స్థానిక చమురువిల్వల అన్వేషణ ఆనాడే ప్రారంభం అయింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా-గోదావరి బేసిన్‌లలో, చమురు, సహజవాయువుల నిక్షేపాలున్నాయని గుర్తించి వాటిని వెలికి తీసే ప్రయత్నం ఒఎన్‌జిసి (చమురు, సహజవాయువుల కమిషన్) ఆధ్వర్యంలో 1978లో ప్రారంభమయింది. 1990నాటికి కైకలూరు నుండి అమలాపురందాకా 60 సహజవాయువు బావులు తవ్వారు. ఇంకా తవ్వుతూనే ఉన్నారు. చమురు కంటే సహజవాయు అన్వేషణే ఎక్కువ ఫలవంతం అయింది. మొట్టమొదటి బావులలో ఒకటయిన రాజోలు - I బావినుండి 1990 నాటికి దినానికి 4.39 లక్షల ఘనపు మీటర్ల సహజవాయువు ఉత్పత్తి అయింది. ఈ సహజవాయువును పైప్‌లైన్లలో విజ్ఞేశ్వరం విద్యుదుత్పత్తి కేంద్రానికి కాకినాడలోని ఎరువుల పరిశ్రమకూ సరఫరా చేస్తున్నారు. చమురు, సహజవాయు నిక్షేపాలు కృష్ణా-గోదావరి బేసిన్‌లో 5940 కోట్ల టన్నులు ఉన్నట్టు అంచనా కాబట్టి ఈ ఉత్పత్తిసరఫరా కార్యక్రమం ఇంకా చాలా కాలం జరగగలదు. ప్రస్తుతం సహజవాయువును ఆధారం చేసుకున్న విద్యుదుత్పత్తి ఇతర రూపాల ఉత్పత్తి కంటే ఖరీదయినది కాబట్టి ఒక్క విజ్ఞేశ్వరం కేంద్రానికి మటుకే గోదావరి బేసిన్ సహజవాయు సరఫరా పరిమితం అయింది.



దీనిలో సాంకేతిక పురోగమనం సాధిస్తే అప్పుడు పరిస్థితి మారిపోతుంది దానిని దృష్టిలో పెట్టుకొని ఒఎన్‌జిసి ఈశాన్య రాష్ట్రాలలో, బొంబాయి-గుజరాత్ ప్రాంతంలో, కృష్ణా-గోదావరి బేసిన్‌లో, ఉత్పత్తి అయ్యే సహజవాయువును ఒకే 'గ్రిడ్' లోకి తేవాలని ఆలోచిస్తూ ఉంది. ఇవన్నీ జరిగితే కోనసీమ బావుల విలువ చాలా పెరుగుతుంది.

ఇదంతా అభివృద్ధి నాణెం బొరుసు.

అవతలి ముఖాన ఉన్నది కాలుష్యం, పంటపొలాలలోకి పైప్‌లైన్ల చొరబాటు, బావుల తవ్వకం కోసం పచ్చటి ప్రకృతి విధ్వంసం, వ్యవసాయ వినాశనం.

ఈ సంవత్సరం మార్చి నెలలో రాజోలు తాలూకా మామిడి కుదురు మండలంలోని కొమురాడ నెం1 బావిలో సహజవాయువు, చమురు 'లీక్' అయి పొలాలు, కొబ్బరి తోటలు, చేపలుపట్టుకునే చెరువులు, కాలవలు చమురుమయం అయిననాడు అంతవరకు రైతులు గొణుక్కుంటూ వణుక్కుంటూ ఉన్న ఫిర్యాదులన్నీ బ్రద్దలయి బయటికొచ్చాయి.

మార్చి 20వ తేదీ పొద్దున్న 11 గంటల సమయంలో సహజవాయువు, చమురు ఎగజిమ్మాయి. తూర్పుగాలి వల్ల ఈదరాడ శివారు గ్రామమయిన కమ్మవారిలంక మీదికి చిమ్మాయి. మళ్లీ 22వ తేదీన సహజవాయువుతో కూడిన చమురు అదే బావినుండి పొర్లి పొలాలలోకి కాలవలలోకి ప్రవహించింది. వేడి చమురు పడిన వరిచేలు, కొబ్బరి చెట్లు నాశనమయ్యాయి. పొర్లిన చమురు కడలి డ్రెయిన్‌లోకి, కమ్మవారి లంకలోని చేపల చెరువులలోకి ప్రవహించి చేపలు చనిపోయాయి. కడలి డ్రెయిన్‌లో నిలువ ఉన్న నల్లటి చమురు 27వ తేదీన అంటుకొని తగలబడి చెన్నాడం గ్రామానికి చెందిన చాలా కొబ్బరి చెట్లు కాలిపోయాయి.

ప్రత్యక్షంగా జరిగిన నష్టాన్ని (రాజోలు, మామిడికుదురు మండలాలకు చెందిన పలు గ్రామాలలో) ప్రభుత్వం రూ॥ 19,47,663 గా అంచనా వేసింది. అందులో దాదాపు సగం (9,75,000) నష్టపరిహారంగా రైతులకు ఇచ్చింది.

### వరిచేలకు, కొబ్బరితోటలకు జరిగిన నష్టం

| | రాజోలు మండలం | మామిడికుదురు మండలం | నష్టం విలువ (రూ॥) |
|---|---|---|---|
| వరిచేలు | 38.80 ఎ. | 42.33 ఎకరాలు | 5,96,298 |
| కొబ్బరిచెట్లు (సంఖ్య) | | | |
| కాపుకొచ్చినవి | 1459 | 3119 | |
| రానివి | 66 | 1757 | 13,46,650 |

జరిగిన నష్టానికి సగమే పరిహారం ఇచ్చారన్నది రైతులు పేర్కొన్న ఒక అభ్యంతరం. అంతకంటె అన్యాయమేమిటంటే చేలలో ఉన్న పంటకు, కొబ్బరి చెట్టుమీద ఉన్న పూతకు జరిగిన నష్టాన్ని లెక్కగట్టి అందులో సగం చెల్లించారు గానీ భూసారం దెబ్బ తినడం వల్ల దీర్ఘకాలంగా జరిగిన నష్టానికి లెక్కలేదు, పరిహారం లేదు. చమురు పేరుకొని పోయిన నేల భూసారాన్ని కోల్పోయిందనీ దానిని బాగుచేయడానికి చాలా ఖర్చవుతుందనీ రైతులు భావిస్తున్నారు. మొదట్లో నేలను తిరిగి సారవంతం చేయడానికి అయ్యే ఖర్చు తామే భరిస్తామనీ సాంకేతిక పరిజ్ఞానం సరఫరా చేస్తామనీ హామీ ఇచ్చిన ఒఎన్‌జిసి ఆ తరువాత ప్లేటు ఫిరాయించి లోతుగా దున్నితే అదే సరిపోతుందని ప్రకటించింది. కనీసం రెండు సీజన్లు పంట తక్కువ దిగుబడి రాక తప్పదనీ ఆ తరువాత గానీ భూసారం కోలుకోదనీ రైతులు వాపోతున్నారు.

రైతులకు కనీసం కొంతయినా నష్టపరిహారం దక్కింది. పూర్తిగా నష్టపోయింది జాలర్లు. కమ్మవారి లంకలో 65 మంది సభ్యులు గల సొసైటీ యాజమాన్యంలో రెండు చేపల చెరువులున్నాయి. ఈ చెరువులలోకి నూనె చిమ్మి చేపలు చచ్చిపోయాయి. మొత్తం 3300 రూపాయలు విలువ చేసే చేపలు చచ్చిపోయాయి. దీనికి ప్రభుత్వం నుండి గానీ ఒఎన్‌జిసి నుండిగానీ దమ్మిడీ నష్టపరిహారం కూడ ముట్టలేదు. అంతేకాక ఆ చెరువులలో పేరుకొని పోయిన చమురంతా బయటకు పోనిదే మళ్లీ చేపలు పెరగవు, బతకవు. దానికి మార్గమేమిటో, ఖర్చు ఎంతవుతుందో సొసైటీ సభ్యులకు తెలిక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఊరిపేరు కమ్మవారి లంక గానీ ఊరంతా దళితులే పేదవాళ్లే.

వాళ్లకయినా వేరే జీవనాధారం - భూములు - ఉన్నాయి. పూర్తిగా మునిగింది కడలి డ్రెయిన్‌లో చేపలు, రొయ్యలు పట్టి బతికే గోగన్నమరం జాలర్లు. పల్లీలు లేక అగ్నికులక్షత్రియులు అని పిలవబడే 400 కుటుంబాలు కడలి డ్రెయిన్‌లో చేపల వేటపైన ఆధారపడి బ్రతుకుతారు. డ్రెయిన్ నిండా ఇప్పుడు చమురు చేరింది. ఆ చమురంతా పోయి కొత్తగా చేపలు వచ్చేదాకా వాళ్ల జీవనాధారం పూర్తిగా కోల్పోయినట్టే. దీనికోసం ప్రభుత్వం ఏమీ చేయడం లేదు. సహజంగానే జరగాలంటే కనీసం రెండు రుతుపవనాలు (అంటే రెండు సంవత్సరాలు) గడవవలసి ఉంటుంది. 400 కుటుంబాలు సంపూర్ణంగా కోల్పోయిన జీవనాధారానికి నష్టపరిహారం దమ్మిడీ కూడ దక్కలేదు. ప్రభుత్వ చర్యల వల్లగానీ వైఫల్యం వల్లగానీ ఆస్తి నష్టం జరిగితే కొంత నష్టపరిహారం చెల్లించే సంప్రదాయం మెల్లమెల్లగా అభివృద్ధి చెందుతోంది. ప్రాణనష్టం జరిగితే 10 వేలో ఎంతో ఎక్స్‌గ్రేషియా ఇచ్చివదిలించుకోవడం అలవాటయిపోయింది. కానీ స్వంత ఆస్తికాక ఇతర జీవనాధారం కోల్పోయిన వాళ్లు ఏ నష్టపరిహారానికీ అర్హులు కారు. ప్రాజెక్టులు కడితే మునిగిన పొలాలకు నష్టపరిహారం సగంలో సగమైనా ఇస్తున్నారు గానీ కూలి చేసుకునే అవకాశం కోల్పోయిన కూలివాళ్ళకు ఏమిస్తున్నారు?

## కస్టడీలో హింసను అరికట్టడానికి
## ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రతిపాదించిన 10 సూత్రాల ప్రణాళిక

(1992 మార్చి నెలలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ 'భారతదేశం: కస్టడీలో చిత్రహింసలు, అత్యాచారాలు, మరణాలు' అనే రిపోర్టు ప్రచురించింది. మన దేశానికి చెందిన పౌరహక్కుల సంఘాల నివేదికలను, దినపత్రికల వార్తలను ఆధారం చేసుకొని ప్రచురించిన ఆ రిపోర్టులో కస్టడీలో హింసను నివారించడానికి ప్రభుత్వం అనుసరించవలసిన 10 సూత్రాల ప్రణాళికను ఆమ్నెస్టీ సూచించింది. ఆ ప్రణాళికను అనువదించి దిగువ ఇస్తున్నాం)

### I మానవహక్కుల పరిరక్షణకు ఒక అధికార విధానం ఉండాలి

పోలీసు స్టేషన్లలోను ఇతర నిర్బంధకేంద్రాలలోనూ నేరవిచారణ జరపడానికి, బెదిరించడానికి చిత్రహింసలను నిత్యం ప్రయోగించడం జరుగుతున్నదని ప్రభుత్వం బహిరంగంగా ఒప్పుకోవాలి. చిత్రహింసలను ఎదుర్కొనే కర్తవ్యానికి అత్యంత ప్రాముఖ్యం ఇవ్వాలి. యావద్దేశం ఆ కర్తవ్యంలో నిమగ్నం కావాలి.

అన్ని రాజకీయపార్టీలు దీనినొక విధానంగా ఆమోదించి, తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలలో అమలు చేయాలి.

### II కస్టడీలో హింసపైన నిష్పాక్షిక విచారణ జరపాలి

కస్టడీలో లైంగిక అత్యాచారాలతో సహా అన్ని రకాల చిత్రహింసలు, మరణాల గురించి వచ్చే ప్రతి ఒక్క ఆరోపణపైన న్యాయవిచారణ జరిపించడం తప్పనిసరి చర్య కావాలి. కస్టడీలో చిత్రహింసలు, అత్యాచారాలు, మరణాల గురించి పౌరహక్కుల సంఘాలు, పత్రికలు ప్రచురించే ప్రాథమిక నివేదికల పైన స్వతంత్రం, నిష్పాక్షికం అయిన విచారణ త్వరగాను సమర్థంగాను జరిగేటట్టు ప్రభుత్వం చూడాలి.

సమర్థవంతంగా విచారణ జరపడానికి అవసరమైన అన్ని అధికారాలూ వనరులూ ఆ విచారణ సంఘాల న్యాయమూర్తులకు ఉండాలి. సాక్షులను, సాక్ష్యాధారమయిన పత్రాలను నిర్బంధంగా రప్పించే అధికారం ఉండాలి.